7 నుంచి పవిత్రోత్సవాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆగస్టు 7 నుంచి 9వ తేదీ వరకు స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీనాథ్‌గౌడ్, ఆలయ ఈఓ ఎస్ అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 9వ తేదీన స్వామి వారికి కలశాభిషేకం ఉంటుందన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల అనంతరం పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలన్నారు.

లింగదీక్ష సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న శివసేన పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు డా. గణేష్ గాటే

కాచిగూడ: వీర శైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌పేటలో లింగదీక్ష సమ్మేళనం నిర్వహించారు. శివసేన పార్టీ కోర్ కమిటీ సభ్యులు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గాటే ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామీజీల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వీరశైవ లింగాయత్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, షేంబుల్, మల్లికార్జున్, సంతోష్, శివ లోకేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం సాధిస్తేనే మంచి భవిష్యత్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకుంటారో ఆ రంగంలో నైపుణ్యం సాధిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని ప్రొ. యాదగిరి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో పీజీ విద్యార్థుల వీడ్కోల కార్యక్రమం ఆదివారం జరిగింది. విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ పీవీ రమణకుమార్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి బాధ్యత గల పౌరుడిగా ఎదగాలన్నారు. ఇటు తల్లిదండ్రులకు అటు గురువులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే జి.వినోద్‌కుమార్, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపల్ మట్టా శేఖర్, డాక్టర్ ఎస్. వెంకటేష్, టి. అశోక్‌గౌడ్, రూప తదితరులు పాల్గొన్నారు.

శ్రీశారదాంబ మ్యూజికల్స్ వార్షికోత్సవం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని శ్రీ శారదాంబ మ్యూజికల్స్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం మొదటి అంతస్తులోని ధ్యాన మందిరంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ. మోహనకృష్ణ, ప్రముఖ గాయిని సురేఖామూర్తి దివాకర్ల జ్యోతి ప్రజ్వలన కావించి మాట్లాడారు. అరసవల్లి శ్రీదేవి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సుధ దేవరకొండ వ్యాఖ్యానం చేశారు. ఈ సందర్భంగా శారదాంబ మ్యూజికల్స్ విద్యార్థులచే నిర్వహించిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. దీనికి కీబోర్డుపై డి. సుదర్శన్, తబలాపై వి. శ్రీధర్ వాద్య సహకారమందించారు. కార్యక్రమంలో శ్రీ శారదాంబ మ్యూజికల్స్ వ్యవస్థాపకురాలు సుధ దేవర కొండ, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్ర కళా ప్రదర్శన

నాంపల్లి: సిరి పెయింటింగ్ ఇనిస్టిట్యూట్, సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో గడచిన మూడు రోజులుగా జేఎన్ఏఎఫ్ఏయూ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించిన చిత్ర కళా ప్రదర్శన ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా కేన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ జ్యోత్స్న, ఎస్‌బీఐ బ్యాంక్ మాజీ మేనేజర్ జి.శంకరరావు హాజరయ్యారు. ప్రదర్శనలోని చిత్రాలను వారు వీక్షించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. చిత్ర కళా ప్రదర్శనలో పాల్గొన్న 25 చిత్రకారులను సత్కరించారు. సిరి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు స్వామి, శివ కుమారి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గజల్ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కోరుప్రోలు మాధవరావు రచించిన అలకనంద పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా దక్షిణ ప్రాంత అధికారి పత్తిపాక మోహన్ మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో గజల్స్ ప్రాముఖ్యతను యువతరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. పలు అంశాలపై రచయిత గజల్ రాసిన తీరు ఎంతో చక్కగా ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ న్యాయమూర్తి నేరేళ్ల మాల్యాద్రి, గజల్ సాహిత్య వేదిక అధ్యక్షుడు ఇ.వెంకటేశ్వర శర్మ, తంగిరాల చక్రవర్తి, ఉమాదేవి, ప్రసాదరావు, ముకుంద సుబ్రహ్మణ్య శర్మ, వెంకట్ పాల్గొన్నారు.

వీరు మారరు.. వారు పట్టించుకోరు.!

- గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్, పీపుల్స్ పార్కులో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇటీవలే తొలగించిన జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది
- మళ్లీ చెత్తమయంగా మారుతున్న వైనం, విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- ఇబ్బందుల్లో స్థానికులు, పట్టించుకోని అధికారులు


వివేకనగర్ పీపుల్స్ పార్క్‌లో ..


గాంధీనగర్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్‌లో చెత్తాచెదారం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. సివిల్స్ సప్లైకి చెందిన 1800 గజాల స్థలంలో కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఇటీవలే జీహెచ్‌ఎంసీ వాహనాల ద్వారా ఎత్తివేశారు. అయితే మళ్లీ గేట్లు ఓపెన్ చేసి ఖాళీగా ఉంచడంతో ఇక్కడ చెత్తాచెదారం వేయడంతో పాటు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఖాళీగా ఉన్న విశాలమైన ప్రభుత్వ స్థలం చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు, మలేరియా, డెంగీ వ్యాధులు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిని పార్కుగా ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి చెత్తాచెదారం తొలగించారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు కూడా వినతిపత్రం అందించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.ఈ ఖాళీ స్థలంలో ఎస్సార్టీ పార్కు చేస్తే ఎంతోమందికి ఆహ్లాదం పంచడంతో పాటు స్థానిక ప్రజలకు, సివిల్స్, గ్రూప్స్, విద్యార్థులకు మేలే చేకురుతుందని స్థానికులు కోరుతున్నారు.

పీపుల్స్ పార్క్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం..

చిక్కడపల్లిలోని పీపుల్స్ పార్క్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పార్కుకు వచ్చే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది వాకింగ్‌కు, యోగా, ఇక్కడ ఉన్న రేణుకా ఎల్లమ్మ, నాగదేవత ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.


చెత్తను తొలగించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని కోరుతున్న కాంగ్రెస్ నేతలు (ఫైల్‌ఫొటో)

కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



గాంధీనగర్ డివిజన్‌లోని సివిల్ సప్లైకి చెందిన 1800 గజాల ఖాళీ స్థలం కొన్నేళ్లుగా చెత్తాచెదారంతో నిండి ఉండడంతో అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందించి జీహెచ్‌ఎంసీ వాహనాలతో తొలగించాం. ప్రస్తుతం మళ్లీ ఇక్కడే చెత్తాచెదారం వేయడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది. వెంటనే జీహెచ్‌ఎంసీ కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం.

– పావని, గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోండి

కాచిగూడ: ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటేను నేర్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగం సూపరింటెండెంట్ బి.రమేష్ అన్నారు. సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే ఆధ్వర్యంలో ఆదివారం ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ప్రాంగణంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన 29 మంది విద్యార్థులకు కలర్ బెల్ట్‌లను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ బ్లాక్ బెల్ట్ హోల్డర్, ఇండియా స్టైల్ చీఫ్ షిహాన్ సిద్దార్థ్ షా, ప్రార్థన మణికొండ, కిక్కర్స్ యునైటెడ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన ఆఫ్ ఇండియా కళ్యాణ్ మాస్టర్, నరసింహ మాస్టర్, నాగరాజ్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో సత్తాచాటిన జీవీఆర్ విద్యార్థులు

◆ బెంగళూర్‌లో ఆదివారం జరిగిన 13వ షోటోఖాన్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో నుండి జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. 18 మంది విద్యార్థులు పాల్గొని 29 బంగారు పతకాలు, 6 రజత పతకాలు సాధించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్‌ను సైతం కైవసం చేసుకున్నారని అకాడమీ డైరెక్టర్ డా. జీఎస్ గోపాల్‌రెడ్డి తెలిపారు. కటా, కుమితి విభాగంలో 14 బంగారు పతకాలు, 3 రజత పతకాలు, కుమితి విభాగంలో 15 బంగారు పతకాలు, 3 రజత పతకాలు సాధించారు.



ట్రాన్స్‌ఫర్మేటివ్ ఫైనాన్సింగ్, ఈక్విటీ విజయవంతం

చిక్కడపల్లి: తమ దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలకు మద్దతు ఇవ్వడానికి.. ఉద్యోగుల చేరికను మెరుగుపరచానికి, కార్యాచరణ పరంగా సౌక్యర్యం పెంచడానికి రూపొందించిన ట్రాన్స్‌ఫర్మేటివ్ ఫైనాన్సింగ్, ఈక్విటీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు లైటస్ టెక్నాలజీస్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెల్లడించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు చిక్కడపల్లిలో ఆదివారం సాయంత్రం మాట్లాడుతూ.. జూలై 7న కంపెనీ నిబంధనల ప్రకారం నమోదు కాని 965 మిలిన్ షేర్ల ప్రైవేట్ ప్లేస్‌మెంట్‌ను పూర్తి చేసిందన్నారు. మధ్యవర్తిత్వ రుసుములు లేకుండా రూ.132 కోట్లు (15.44మిలిన్లు) సేకరించిందన్నారు.

యూపీఎస్సీ తరహాల్లో నోటిఫికేషన్ విడుదల చేయాలి

చిక్కడపల్లి: నిరుద్యోగులు ఎలాంటి ధర్నాలు, నిరసనలకు పిలుపు ఇవ్వకపోయినా ఆదివారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు నిర్బంధం విధించారు. నిరుద్యోగులను అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగులు రవి, రాథోడ్, విశాల్, నితీష్, నవీన్, అమర్‌లు అక్రమంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకుడు రవి రాథోడ్ మాట్లాడుతూ... ఎలాంటి ధర్నాలకు నిరసనకు పిలుపునివ్వకుండా చిక్కడపల్లి, అశోక్‌నగర్ ప్రాంతాలల్లో అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. జాబ్ కేలండర్ విడుదల చేసి ఒక సంవత్సరం కావడంతో శనివారం గాంధీనగర్‌లో పిండ ప్రదానం కార్యక్రమాన్ని చేశారు. దీంతో ప్రభుత్వం అక్కసుతో నిరుద్యోగులను అక్రమంగా అరెస్టు చేయిస్తోందని తెలిపారు. ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయకుండా 60వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రతీ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఎటువంటి లిటిగేషన్ లేకుండా యూపీఎస్సీ తరహాల్లో నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదల చేయని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీని బొంద పెడుతామని హెచ్చరించారు.


నిరుద్యోగులను అరెస్టు చేసిన చిక్కడపల్లి పోలీసులు

బీసీలు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

చిక్కడపల్లి: బీసీలంతా ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని అరుంధతీనగర్ బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్‌లోని అరుంధతినగర్‌లో బీసీల చైతన్యమే మన ఆలోచన సాధన సమితి(ఎంసీఎస్ఎస్) ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కైరంకొండ నర్సింగ్, బాబా, సాయి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


అరుంధతినగర్‌లో ఎంసీఎస్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

మా పోరాట ఫలితమే కమిషనర్ పోస్ట్‌కు నోటిఫికేషన్

డ్వాబ్ ప్రధాన కార్యదర్శి చొక్కారావు



చాదర్‌ఘాట్: తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషనర్ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయటం అభినందనీయమని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత అంధుల సమాఖ్య సహకారంతో డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆఫ్ ది బ్లైండ్ తరుపున 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం దివ్యాంగులకు స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషనర్‌ను నియమించాలని హైకోర్టులో పోరాడామని తమ పోరాట ఫలితంగా ప్రభుత్వం దివ్యాంగుల కమిషనర్‌కు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. కమిషనర్ పోస్ట్‌కు అర్హులైన అంధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తెలంగాణ రత్నాల గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రముఖ రచయిత అనువాదకుడు తెలంగాణ అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు దివంగత దేవులపల్లి ప్రభాకర్‌రావు రచించిన 'తెలంగాణ రత్నాలు'అనే గ్రంథావిష్కరణ సభ ఆదివారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని తెలుగు భాషా నిలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, భాషా నిలయం అధ్యక్షుడు డాక్టర్ కేవీ రమణాచారి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..89 మంది తెలంగాణ ప్రముఖుల గురించి పెన్షనర్ల ఉద్యమంపై ప్రభాకర్‌రావు నెల నెల రచించిన తెలంగాణ ప్రముఖుల జీవిత చరిత్రకు సంబంధించిన వ్యాసాలను శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయం పక్షాన టి.ఉదయవర్లు సంపుటికరించిన భాషా నిలయం ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్‌రావు నేతృత్వంలో భాషా నిలయం ప్రచురించిందని తెలిపారు. ఇలాంటి రచనలు ప్రజల్లో రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం రమణాచారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.నర్సింహా మూర్తి, జగదీశ్వర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికే పదవులు


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న సయ్యద్ మోహియుద్దీన్ తదితరులు

ముషీరాబాద్: పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికే కాంగ్రెస్ అధిష్ఠానం పదవులలో నియమిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భోలక్‌పూర్‌కు చెందిన టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మోహినుద్దీన్ ఇంటికి మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.ఈకార్యక్రమంలో నాయకులు బిలాల్, హాజీమ్, జావిద్, డాక్టర్ బాసిత్ పాల్గొన్నారు.

సాహిత్య రంగానికి మాచిరాజు చేసిన సేవలు ఎనలేనివి


పురస్కార గ్రహీతలతో చొక్కాపు వెంకటరమణ

గన్‌ఫౌండ్రీ: సాహిత్య రంగానికి మాచి రాజు చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాల సాహిత్య పరిషత్, మాచి రాజు బాల సాహిత్య పీఠంల సంయుక్తాధ్వర్యంలో మాచి రాజు సీతారామయ్య పేరిట స్మారక బాలసాహిత్య పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రముఖ రచయితలు ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, నాగేశ్వర్‌రావుకు ఈ పురస్కారాలను అందజేశారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్, బాల సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ..చందమామ కథలతో మాచిరాజు ఎంతో మందికి దగ్గరయ్యారని గుర్తుచేశారు. అంతకు ముందు చందమామ కథలు, బాల కథాచంద్రిక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రప్రతాప్, శ్రీనివాసకుమార్, పైడిమర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

31న రాష్ట్ర థైక్వాండో చాంపియన్‌షిప్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాస్టర్ జయంత్‌రెడ్డి, హనుమంతు

ముషీరాబాద్: కేఎల్‌బీ–2 ఓపెన్ తెలంగాణ రాష్ట్ర థైక్వాండో చాంపియన్‌షిప్‌ను ఈనెల 31న ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్‌లో నిర్వహించనున్నట్లు థైకాండో గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి తెలిపారు.థైక్వాండో సీనియర్ కోచ్‌లు కేపీ హనుమంతు, విజయ్‌సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే పోటీ పోస్టర్‌ను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో థైకాండో సీనియర్ కోచ్ కె.పి.హనుమంతు, గజేందర్, నాగరాజు, అర్జున్, అబ్దుల్, లోకేష్, నరేష్, నరేందర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్‌లో ఖాళీలు భర్తీ చేయాలి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్‌లో ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమశాఖను స్వతంత్ర శాఖగా కొనసాగించాలని, 33 జిల్లాలో ఏడీ ఆఫీసులు తెరవాలన్నారు. ఓహెచ్, రోస్టర్ పాయింట్ 10 లోపు మార్పుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. డ్రెస్ కోడ్ ఉద్యోగాలలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ విషయంలో కార్పొరేషన్ ఎండీ శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్య చొరవ చూపి అమలుకు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం, భారతనాట్యాలయం సంస్థ ఆధ్వర్యంలో నాట్య గురువు డాక్టర్ చిత్ర నారాయణన్ శిష్యులు తనీషా రెడ్డి, హనీషా రెడ్డి భరతనాట్య ఆరంగేట్రం ఆదివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పుష్పాంజలి, వర్ణం, తొడై మంగళం, మహాదేవ శివ శంభో, తక్కువేమి మనకు, థిల్లాన వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుంచే చిన్నారులకు శాస్త్రీయ కళలపై మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్ అధ్యక్షుడు మురళి ముకుంద్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్య నిషేధం విధించాలి


మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సును రద్దుచేసి సంపూర్ణ మద్య నిషేధం విధించాలని తెలంగాణ ఆటో జేఏసీ కన్వీనర్ అమానుల్లా ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి దివంగత ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడిస్తే రాష్ట్రంలో ఫ్రీ బస్సులకు బదులు సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న నగరంలో ఒక్కరోజు ఆటో బంద్‌కు తాము పిలుపునిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, హత్యలు, నేరాలు ఘోరాలు, మహిళలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించడానికి రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం విధించడం తప్పా మరో గత్యంతరం లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో పెరిగిన ఆర్‌టీఏ సర్వీస్ ఛార్జీలు పుండుమీద కారం చల్లినట్లు ఉందని కాబట్టి జీఓ నెంబర్ 51ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస బోనాలు

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సమీపంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో ఆదివారం శ్రావణ మాస బోనాల సందడి నెలకొంది. ఉదయం అమ్మవార్లకు అభిషేకం చేసి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్, కార్పొరేటర్లు లావణ్య, అమృత తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించి తీర్థచారు. బీజేపీ సీనియర్ నేత బి.సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీ తొట్టెల ఊరేగింపును నిర్వహించారు. ఈ బోనాల వేడుకల్లో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు, సలహాదారు చంద్రయ్య, నాగేష్, లోకల్ లారీ అసోసియేషన్ సభ్యుడు ఎం.నాగరాజుగౌడ్, బి.ధన్‌రాజ్‌యాదవ్, ఎం.భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


తొట్టెల ఊరేగింపులో భక్తులు

ఒడి బియ్యం.. అన్నదానం

నల్లకుంట రత్నానగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో గత నెల 20న ఆషాఢమాస బోనాలు నిర్వహించారు. అప్పుడు భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యాన్ని ఆదివారం వండి అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయంలో ముత్యాలమ్మకు మారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నానగర్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎంటీ. కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాము యాదవ్, ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శి వీరయ్య గౌడ్ కోశాధికారి పి. వెంకటేష్ పాల్గొన్నారు.



మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్ లావణ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు